సాక్షి
సూర్యాపేట
సోమవారం, 17, మార్చి, 2025



రిటైర్డ్ ఉద్యోగులకు అండగా..
రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం అండంగా ఉంటుందని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. - 8లో



యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ
యాదగిరిగుట్ట క్షేత్రంలో భక్తుల రద్దీ నెల కొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. - 8లో



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-32 (సోమవారం సా.)
సహర్ 5-00 (మంగళవారం ఉ.)

న్యూస్‌రీల్

నేడు పోలీస్ గ్రీవెన్స్ డే

సూర్యాపేట టౌన్: సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్టు ఎస్పీ నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చివరి విడతగా నేటి నుంచి గోదావరి జలాలు



71డీబీఎం కాలువలో పారుతున్న గోదావరి జలాలు (ఫైల్)

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాలోని ఎస్సారెస్పీ రెండోదశ పరిధిలోని ఆయకట్టుకు వారబందీ విధానంలో చివరి విడతగా సోమవారం గోదావరి జలాలను పునరుద్ధరించనున్నారు. ఈ నీళ్లు ఈనెల 24 వరకు రానున్నాయి. అయితే ఈ యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు వారబందీ పద్ధతిలో జనవరి 1 నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు తడులలో నీటిని ఇచ్చారు. ఆరవ తడికి గాను సోమవారం విడుదల చేయనున్నారు. ఇది ఆఖరి విడత అని నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని బయ్యన్నవాగు డీఈఈ ఎం.సత్యనారాయణ కోరారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు


అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆతర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, ఇంద్రారెడ్డి, కాకులారపు రజిత, అర్చకులు భీంపాండే, శ్రీరాం పాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

నేడు, రేపు జాతీయ సెమినార్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమ, మంగళవారాల్లో జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసీఎస్‌ఎస్‌ఆర్) ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. «గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ప్రాస్పెక్ట్ అండ్ చాలెంజెస్» అనే అంశంపై తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషనల్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం, ప్రొఫెసర్లు జి.యాదగిరి, ఎం.రాములు, ముత్యం రెడ్డి, ఇంద్రకాంత్, పున్నయ్య, కొప్పుల అంజిరెడ్డి, వాసుదేవశర్మ ప్రసంగించనున్నారు. చివరి రోజున ఐసీఎస్‌ఎస్‌ఆర్ డైరెక్టర్ బి.సుధాకర్‌రెడ్డి సందేశంతో సెమినార్ ముగియనుంది.

కొత్త సార్లు వచ్చేశారు!

- జిల్లాకు 14 మంది జూనియర్ లెక్చరర్లు
- నెమ్మికల్ కళాశాలకు ఐదుగురు కేటాయింపు
- మిగతా వారు ఇతర కళాశాలలకు..
- ఇప్పటికే విధుల్లో చేరిన 11 మంది



సూర్యాపేట టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కొత్త అధ్యాపకులు వచ్చేశారు. ఇన్నాళ్లు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో ఏటా గెస్ట్ లెక్చరర్లతో కాలం వెల్లదీశారు. రెండేళ్ల క్రితం నిర్వహించిన పోటీ పరీక్షల్లో జూనియర్ లెక్చరర్లు ఎంపికైన వారికి ప్రభుత్వ ఇటీవల నియామక పత్రాలు అందజేసింది. దీంట్లో భాగంగా జిల్లాకు కొత్తగా 14 మంది జూనియర్ లెక్చరర్లను కేటాయించింది. వీరిలో 11 మంది శనివారం విధుల్లో చేరినట్టు డీఐఈఓ కార్యాలయ వర్గాలు తెలిపారు. ఎట్టకేలకు 13 ఏళ్ల తర్వాత కొత్తగా లెక్చరర్లు రావడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బోధనా పరంగా మరింత బలోపేతం కానున్నాయి.

ఇన్నాళ్లు పదోన్నతులు మాత్రమే..
గత 2014, 2016, 2019, 2021 సంవత్సరాల్లో పదోన్నతులు మాత్రమే కల్పించగా ఇంటర్ బోర్డు మూడేళ్ల క్రితమే జూనియర్ కళాశాలల్లో ఖాళీలను గుర్తించి 2022 డిసెంబర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబర్ 2023లో పరీక్షలు నిర్వహించారు. గత ఏడాది జూన్ లో ఫలితాలు వెల్లడించినా పలు కారణాలతో వీటి నియామక ప్రక్రియ ఆలస్యమైంది. ప్రస్తుతం ఇంటర్ విద్యా సంవత్సరం ముగుస్తుండడంతో కొత్త వారికి శిక్షణ ఇచ్చి వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి సారించనున్నారు.

తొలగనున్న ఇబ్బందులు
జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఇందులో ప్రస్తుతం 80మంది వరకు రెగ్యులర్ అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరు సరిపోకపోవడంతో గెస్ట్ లెక్చరర్లను నియమిస్తున్నారు. దీంతో బోధనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాగా ఏడు జూనియర్ కళాశాలలకు గాను ఐదింటికి కొత్తగా రెగ్యులర్ అధ్యాపకులను కేటాయించారు. దీంతో ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది కొరత తీరవడంతోపాటు ఇబ్బందులు తొలగనున్నాయి.

అధ్యాపకుల కొరత తీరనుంది
జిల్లాలోని ఏడు జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం 14 మంది లెక్చరర్లను కేటాయించింది. ఆయా కళాశాలల్లో ఇప్పటి వరకు 11 మంది అధ్యాపకులు విధుల్లో చేరారు. మరో ముగ్గురు అధ్యాపకులు వచ్చే వారంలో జాయిన్ కానున్నారు. వీరి రాకతో కొంత మేర అధ్యాపకుల కొరత తీరి విద్యార్థులకు మెరుగైన బోధన అందనుంది.
– భానునాయక్, డీఐఈఓ, సూర్యాపేట

ఖాళీలను బట్టి ఐదు కళాశాలలకు..
జిల్లాలోని ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలను బట్టి కొత్తవారిని కేటాయించారు. నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఐదుగురు అధ్యాపకులను కేటాయించారు. ఇందులో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ , మ్యాథ్స్ సబ్జెక్టులకు ఒక్కొకరు చొప్పున అధ్యాపకులు విధుల్లో చేరారు. అలాగే నేరేడుచర్లలో ఒక మ్యాథ్స్ లెక్చరర్, కోదాడ కేఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులకు ఒకరి చొప్పున ముగ్గురిని కేటాయించారు. హుజూర్‌నగర్ జూనియర్ కళాశాలలో తెలుగు, సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టులకు ఒకరు చొప్పున అధ్యాపకులు విధుల్లో చేరారు. వీరితో పాటు మరో ముగ్గురు అధ్యాపకులు వచ్చే వారంలో విధుల్లో చేరనున్నారు.

ఎస్సీ రిజర్వేషన్ పెంచుతాం



తుంగతుర్తి కాంగ్రెస్ కృతజ్ఞత బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి ఆర్డీఆర్, ఎమ్మెల్యేలు సామేలు, వీరేశం, నాయకులు

- జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు
- రాష్ట్ర నీరుపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- తుంగతుర్తిలో కాంగ్రెస్ కృతజ్ఞత బహిరంగ సభ
- హాజరైన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల తదితరులు



మంత్రి తుమ్మలకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సామేలు, చిత్రంలో మంత్రి ఉత్తమ్, దామోదర్‌రెడ్డి

తుంగతుర్తి: ఎస్సీ రిజర్వేషన్ శాతం పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 2026లో నిర్వహించనున్న జనాభా లెక్కల ప్రకారం కచ్చితంగా పెంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీరుపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కృతజ్ఞత సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణే అని స్పష్టం చేశారు. చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

బడ్జెట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులు
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. మొదటి బిల్లు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్, రెండో బిల్లు స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్, మూడో బిల్లు ఎస్సీల్లోని 15శాతం రిజర్వేషన్లను 59 ఎస్సీ ఉపకులాలకు పంచేలా ఉపకోటా నిర్ణయిస్తామన్నారు. ఈనెల 17న ఎస్సీ ఉప వర్గీకరణ బిల్లుపై, 18న బీసీ రిజర్వేషన్, కుల సర్వే అంశంపై ప్రభుత్వం చర్చలు జరపనుందన్నారు. నా నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు ఒక ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని, న్యాయమూర్తి షమీమ్ అఖ్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌ను నియమించడం ఇందుకు నిదర్శనమని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులందరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ కమిషన్ నివేదిక ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తోందని తెలిపారు. 1931 తర్వాత తెలంగాణలో మొదటిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయి కుల ఆధారితంగా సామాజిక–ఆర్థిక సర్వే నిర్వహించిందని వివరించారు.

తుంగతుర్తి అభివృద్ధికి కృషి
తుంగతుర్తి తన స్వస్థలమని, ఈ ప్రాంతాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. సూర్యాపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, తుంగతుర్తికి ఎస్సారెస్పీ ఫేజ్–2, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందిస్తామనానరు. అంతేకాకుండా తుంగతుర్తికి గోదావరి, మూసీ నదుల నీటిని తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం సభలో మంత్రులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గొర్రె పిల్లలు, గొంగళ్లు, డప్పులను బహూకరించి సన్మానించారు. ఈ సభలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేషం, లక్ష్మీకాంత్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య, కడియం పరమేశ్వర్, గుడిపాటి సైదులు, దొంగరి గోవర్ధన్, గిరిధర్‌రెడ్డి, చింతకుంట్ల వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

భానుపురి (సూర్యాపేట): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర కోశాధికారి ధరావత్ రవి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల వర్ధంతి సభలను ఈనెల 23 నుంచి గ్రామగ్రామాన నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ఉపాధ్యక్షుడు వీరబోయిన రమేష్, కోశాధికారి బండి రవి, సభ్యులు గిరి, అశోక్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీజయరాం స్వామి జాతర

- పాల్గొన్న వేలాది మంది భక్తులు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చివ్వెంల : మండల పరిధిలోని జయరాంగుడి తండాలో శ్రీ జయరాం స్వామి జాతరను ఆదివారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. సుమారు 200 సంవత్సరాల చరిత్ర గల ఈ జాతరకు జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి వందలాది మంది గిరిజన భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర రెండు రోజులపాటు జరగనుంది. జాతర సందర్భంగా వెలిసిన దుకాణాల వద్ద మొదటి రోజుల భక్తుల రద్దీ భారీగా ఉంది. వేడుకల్లో మాజీ ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, గ్రామ మాజీ సర్పంచ్‌లు హాలవత్ సుశీల, కె.శారదదేవి, ధరావత్ పద్మమంగ్యా నాయక్, మాజీ ఎంపీటీసీ బానోతు లచ్చిరాం నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు చీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు తప్పని తాగునీటి కష్టాలు..
దూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలలో జాతరకు వచ్చిన భక్తులకు తాగునీటి కష్టాలు తప్పలేదు. ప్రతి సంవత్సరం జాతరకు వేలాది రూపాయల ఆదాయం వస్తున్నా నిర్వాహకులు కనీస వసతుల కల్పనలో అలసత్వం వహిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి వసతి లేకపోవడంతో వ్యవసాయ పొలాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జాతర వద్ద రద్దీగా ఉన్న భక్తులు

మట్టపల్లిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు కొనసాగాయి. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను ఆలయ వీధుల్లో ఊరేగించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వినయ్‌భానురెడ్డి యాదిలో..



వినయ్‌భానురెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబసభ్యులు, నాయకులు

బొమ్మలరామారం : మండల కేంద్రానికి చెందిన దివంగత లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భాను రెడ్డి ద్వితీయ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మలరామారంలోని గుడిబావి చౌరస్తా వద్ద ఉన్న వినయ్ భాను రెడ్డి విగ్రహానికి కుటుంబ సభ్యులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వినయ్ భానురెడ్డి సతీమణి స్పందనారెడ్డి, తల్లిదండ్రులు ఉప్పల నర్సింహారెడ్డి, విజయలక్ష్మి, దంతపల్లి వంశీరెడ్డి పాల్గొన్నారు.

ఒంటిపూట బడుల వేళల్లో మార్పు


సూర్యాపేట టౌన్: ఒంటిపూట బడుల వేళల్లో మార్పులు చేస్తూ పాఠశాల విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు మొదటి గంట, 8.05 గంటలకు రెండో గంటతో పాటు ప్రార్థన చేసి 8.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని మొదట ఆదేశాలు ఇచ్చింది. ఈ వేళల్లో స్వల్ప మార్పులు చేసింది. ఉదయం 7.45కు మొదటి గంట, 7.50కి రెండో గంటతో పాటు ప్రార్థన చేయాల్సి ఉంటుంది. 8 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తరగతులు నిర్వహించిన తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సవరించిన వేళలను అమలు చేయాలని డీఈఓ అశోక్ ఆదేశించారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చనలు చేశారు. ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.

చకచకా మూల్యాంకనం

- 10వ తేదీనే ప్రారంభమైన ఇంటర్ పేపర్ల స్పాట్ వాల్యుయేషన్
- సంస్కృతం పేపర్లు దిద్దుతున్న అధ్యాపకులు
- సీసీ కెమెరాల నిఘాలో సాగుతున్న ప్రక్రియ
- ఏప్రిల్ 10వ తేదీ నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక



నల్లగొండ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల మూల్యాకనం చకచకా సాగుతోంది. ఇంటర్ పరీక్షలు సాగుతుండగానే.. ఈ నెల 10వ తేదీనే అధికారులు మూల్యాంకనాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అన్ని పేపర్లను నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాలలో దిద్దుతున్నారు. మూల్యాంకనం నిర్వహించే ప్రతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విడతల వారీగా ఈ ప్రక్రియను చేపట్టి ఏప్రిల్ 10వ తేదీ నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు.

నాలుగు విడతల్లో ప్రక్రియ..
మొదటి విడతలో సంస్కృతం పేపర్ మూల్యాంకనాన్ని ఈ నెల 10న ప్రారంభించారు. ఆ పేపర్లను దిద్దేందుకు 40 మంది సబ్జెక్టు ఎగ్జామినర్లను నియమించారు. ఈ నెల 22న రెండో విడత మూల్యాకనం ప్రారంభం కానుంది. అందులో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్ పేపర్లను మూల్యాంకనం చేయనున్నారు. ఈ నెల 24వ తేదీన 3వ విడత మూల్యాంకనంలో ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్ల మూల్యాంకనం చేస్తారు. 26వ తేదీన కెమిస్ట్రీ, కామర్స్ పేపర్ల మూల్యాంకనం ప్రారంభం కానుండగా చివరి 4వ విడత మూల్యాంకనం ఈ నెల 28న ప్రారంభం కానుంది. అందులో హిస్టరీ, బయాలజీ, జువాలజీ పేపర్లను దిద్దనున్నారు.

1800 మంది వరకు అధ్యాపకులు..
ఇంటర్మీడియట్ పేపర్ల మూల్యాంకనం చేసేందుకు మొత్తం 1800 మంది వరకు ఎగ్జామినర్లను నియమించనున్నారు. వీరితో పాటు పేపర్లు అందించేందుకు మరో 1500 మందిని బాయ్స్‌ను నియమించనున్నారు. ఇంటర్ బోర్డు నుంచి వచ్చిన సబ్జెక్టు అధ్యాపకులను మాత్రమే ఎగ్జామినర్లుగా తీసుకోనున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ..
ఇంటర్ పేపర్ల మూల్యాంకనం సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగుతోంది. మూల్యాంకనం నిర్వహించే ప్రతి రూమ్‌లో ఇప్పటికే అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పేపర్ ఓపెన్ చేసింది మొదలుకుని మూల్యాంకనం పూర్తయ్యే వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగనుంది.

పారదర్శకంగా వాల్యుయేషన్



ఇంటర్మీడియట్ పేపర్ల మూల్యాంకనం ప్రారంభమైంది. 4 విడతల్లో మూల్యాంకనం చేయనున్నాం. పేపర్లు దిద్దే ఎగ్జామినర్లకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా ప్రక్రియ జరగనుంది. ఏప్రిల్ 10లోపే మూల్యాంకన ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉంది.
– దస్రూనాయక్, డీఐఈఓ

ఈసారి బయోమెట్రిక్ హాజరు..
ఈసారి పేపర్లు వాల్యువేషన్‌కు వచ్చే ఎగ్జామినర్లకు బయోమెట్రిక్ హాజరును ఇంటర్ బోర్డు ప్రవేశ పెట్టింది. మూల్యాంకానికి వచ్చే అధ్యాపకులు రోజూ ఉదయం 10.30 గంటలలోపే బయోమెట్రిక్ హాజరు వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వచ్చిన వారికి అనుమతి ఉండదు. ఒక్కో ఎగ్జామినర్‌కు రోజుకు 30 పేపర్లు దిద్దేందుకు అవకాశం ఉంటుంది.





'బిక్కేరు' ఎండింది!
ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామం నుంచి మక్తాకొత్తగూడెం వరకు ప్రవహించే బిక్కేరు వాగు నీరులేక ఎండి రాళ్లు తేలింది. గతేడాది ఆగస్టులో కురిసిన వర్షాలకు ఏపూరు వద్ద బ్రిడ్జి పైనుంచి ఫీటు ఎత్తుతో బిక్కేరు వాగు ఉధృతంగా పారింది. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం అడుగంటి కళాహీనంగా మారింది. - ఆత్మకూర్ (ఎస్)

క్లుప్తంగా

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి

నకిరేకల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలోని పద్మానగర్ జంక్షన్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన విపర్తి రామ శ్రీనివాస్(64) తన భార్య రామలక్ష్మితో కలిసి శనివారం సాయంత్రం కారులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గ మధ్యలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నకిరేకల్ పట్టణంలోని పద్మానగర్ జంక్షన్ వద్ద టీ తాగేందుకు హోటల్ వద్ద ఆగారు. రామ శ్రీనివాస్ టీ తాగి జాతీయ రహదారి దాటి మూత్రవిసర్జన చేసి తిరిగి వస్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ శ్రీనివాస్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించింగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దకు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలో జరిగింది. నల్లగొండ రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రం శివారులో విష్ణుపురం–కొండ్రపోల్ రైల్వే స్టేషన్ల మధ్య యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వెళ్లే రైల్వే గేట్ వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి(సుమారు 45 ఏళ్లు) రైలు కింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసిన వారు 8712658595, 9701379708 నంబర్లను సంప్రదించాలని రైల్వే ఎస్‌ఐ సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

చివ్వెంల(సూర్యాపేట): బీరు సీసాతో వ్యక్తి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం జి.తిర్మలగిరి గ్రామానికి చెందిన మోతె హనుమంతు(65) గత నెల 21వ తేదీన గ్రామ సమీపంలోని బ్రిడ్జి కింద చేపలు పడుతుండగా.. మొదిన్‌పురం గ్రామానికి చెందిన రేవల్లి మహేష్ అతడిపై బీరు సీసాతో దాడి చేసి గొంతు కోసి బురదలో తొక్కి పారిపోయాడు. స్థానికులు గమనించి హనుమంతును సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంతకాలంగా మహేష్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో హనుమంతు తనకు చేతబడి చేశాడని అనుమానిస్తూ అతనిపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. హనుమంతు కుమారుడు దశరథ ఫిర్యాదు మేరకు సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి మహేష్‌ను అదే నెల 25వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన హనుమంతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా తరలిస్తున్న గోవులను చౌటుప్పల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి డీసీఎంలో 17 గోవులను హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలోని కబేళాకు తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా ఏపీలోని అనకాపల్లి జిల్లా ధర్మవరం నుంచి హైదరాబాద్‌కు ఆటోలో 10 గోవులను తరలిస్తుండగా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం డ్రైవర్ ఎండీ అంజాద్, ఆటో డ్రైవర్ అప్పలరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండంగా ఉంటుందని, ప్రాధాన్యతా క్రమంలో వారి సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయిక్రీడా పోటీలను ఆదివారం మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను కూడా రిటైర్డ్ ఉద్యోగినేనని, వారి సమస్యల పట్ల తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్ కార్డు సమస్య న్యాయమైనదేనని త్వరలోనే దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. పైరవీలు లేకుండా పదోన్నతులు, బదిలీలు నిర్వహించామన్నారు.

ఉచిత పథకాలతో అనర్థాలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక వసతులను మెరుగుపర్చాల్సిన అవశ్యకత ఎంతో ఉందని, కానీ నిధులను ఉచిత పథకాలకు ఖర్చు చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని, ఉచిత పథకాలు కేవలం అర్హులకే పరిమితం చేయాలన్నదే తన అభిప్రాయమని అన్నారు. 40 సంవత్సరాల క్రితం కిలో బియ్యం రూ.2కు ఇచ్చారని అదే పథకాన్ని 40 సంవత్సరాల తర్వాత కూడా మరో రూపాయి తగ్గించి కొనసాగించాల్సిన పరిస్థితి ఎందుకు ఉందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్ సమావేశాల అనతరం రిటైర్డ్ ఉద్యోగలతో రాష్ట్రస్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమ విలువైన సూచనలు సలహాలు ప్రభుత్వానికి అందించాలని ఆయన కోరారు. నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గరిడేపల్లిలో రిటైర్డ్ ఉద్యోగుల భవనానికి తన ఎంపీ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, అఖిల భారత రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి డాక్టర్ సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎస్‌కే బషీర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

చదరంగంలో కార్తికేయ ప్రపంచ రికార్డు

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చెస్ కాంపిటీషన్‌లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన గుండా మహేష్–చంద్రకళ దంపతుల కుమారుడు కార్తికేయ 180 చెస్ బోర్డులపై ఏకధాటిగా అత్యంత వేగంగా పావులు కదుపుతూ కేవలం 9.41 నిమిషాల్లో చెక్ పెట్టి సరికొత్త ప్రపంచ రికార్డు సాధించాడు. ఈ సందర్భంగా కార్తికేయకు నోబెల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ పాల్గొని మాట్లాడారు. చదరంగంలో చిన్న వయస్సులోనే ప్రపంచ రికార్డు సాధించిన చిన్నారి గుండా కార్తికేయ భవిష్యత్తులోనూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్తికేయ తల్లిదండ్రులను, కోచ్ దివ్యశ్రీని తిరుమలగిరి సురేందర్ అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మాశెట్టి శ్రీనివాస్, గీత, పల్లి రామచంద్రరావు తదితరులు ఉన్నారు.



నోబెల్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కార్తికేయ

జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడం అమానుషం

నాగార్జునసాగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తాడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సెషన్ నుంచి సస్పెండ్ చేయడం అమానుషమని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం నాగార్జునసాగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అభ్యంతరకరమైన మాటలు మాట్లాడకున్నా, స్పీకర్‌ను దూషించాడనే కారణంతో జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడం ప్రశ్నించే గొంతుకను నొక్కడమేనని అన్నారు. జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర మండల పార్టీ అధ్యక్షులు జటావత్ రవినాయక్, వెంకట్‌రెడ్డి, రమేశ్‌జీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బడుగుల లింగయ్య యాదవ్, ఎంసీ కోటిరెడ్డి

బైకు ఢీకొని మహిళ దుర్మరణం

- ఆమె కుమార్తెకు గాయాలు

భువనగిరి: రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని మహిళ మృతిచెందింది. ఆమె కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన ఉల్లోజు వెంకటేష్ తన భార్య కల్పన(32), ముగ్గురు కుమార్తెలతో కలిసి ఆరేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం రాయగిరి గ్రామానికి వలస వచ్చాడు. వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం కల్పన, ఆమె పెద్ద కుమార్తె భావన కలిసి రాయగిరి గ్రామ పరిధిలో హైదరాబాద్–వరంగల్ ప్రధాన రహదారి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బైక్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కల్పన అక్కడికక్కడే మృతిచెందగా.. భావనకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భావనను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కల్పన మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గుత్తాను కలిసిన నెల్లికంటి సత్యం



గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నెల్లికంటి సత్యం

నల్లగొండ టూటౌన్ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఆదివారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తాకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు ఈటి నరసింహ ఉన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు

కొండమల్లేపల్లి: లారీని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టడంతో 11 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలోని గాజీనగర్ పరిధిలో గల ఉప్పువాగు వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఆదివారం సాయంత్రం దేవరకొండ నుంచి మిర్యాలగూడకు 56 మంది ప్రయాణికులతో బయల్దేరింది. కొండమల్లేపల్లి మండల పరిధిలోని గాజీనగర్ పరిధిలో గల ఉప్పువాగు వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ నర్సింహులు, ఎస్‌ఐ అజ్మీరా రమేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు.



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

త్రిపురారం: రెండు బైక్‌లను మరో బైక్ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిడమనూరు మండలం ముప్పారం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. నిడమనూరు మండలం బంకాపురం గ్రామానికి చెందిన కొంగల ఆంజనేయులు, తన భార్య కొంగల కరుణతో కలిసి ఎర్రబెల్లిలో బంధువుల పెళ్లికి వెళ్తున్నారు. పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన మారబోయిన శేఖర్ నిడమనూరు మండలం ముప్పారంలో బంధువుల ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ రెండు బైక్‌లను ముప్పారం గ్రామ శివారులో మూలమలుపు వద్ద మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, కరుణ, శేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాటసారులు గమనించి క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

బొలేరో వాహనం ఢీకొని..

మర్రిగూడ: ద్విచక్ర వాహనం, బొలేరో వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిగూడ మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగింది. మర్రిగూడ మండలం రాజాపేటకు చెందిన జింకల దినేష్, వట్టిపల్లికి చెందిన నవీన్ బైక్‌పై బట్లపల్లిలో శుభకార్యానికి వెళ్తున్నారు. వారు మర్రిగూడ శివారులోకి చేరుకోగానే నాంపల్లి నుంచి వస్తున్న బొలేరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దినేష్, నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని అంబులెన్స్‌లో మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వలస కార్మికుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్: పని చేసే ప్రదేశంలో ఉరేసుకుని వలస కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని బొర్రోళ్లగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కాజల్ పహరియా(24) చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ పరిధిలోని మెటల్ ఇండస్ట్రీస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ.. కంపెనీ పరిసరాల్లోనే తనకు కేటాయించిన గదిలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి కాజల్ పహరియా కంపెనీలో విధులు ముగించుకొని తాను ఉంటున్న గదికి తిరిగి వచ్చాడు. ఆదివారం ఉదయం అతడితో పాటు గదిలో ఉంటున్న తోటి కార్మికులు నిద్రలేచి చూసేసరికి కాజల్ పహరియా కనిపించకపోవడంతో కంపెనీ పరిసరాల్లో వెతకగా.. చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.



కాజల్ పహరియా (ఫైల్)

కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతి

పెద్దఅడిశర్లపల్లి: కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతిచెందాయి. పెద్దవూర మండలం పెద్దగుమ్మడం గ్రామానికి చెందిన పిల్లి సోమయ్య ఇటీవల 11 గొర్రెలు కొనుగోలు చేశాడు. శనివారం సాయంత్రం గొర్రెలను దొడ్డిలోకి తోలగా.. రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 11 గొర్రెలు మృతిచెందాయి. రూ.1.40లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. అదేవిధంగా పెద్దఅడిశర్లపల్లి మండలం బాణాలకుంటతండాలో జటావత్ మంగికి చెందిన రెండు గొర్రెలపై కూడా కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. వీటి విలువ రూ.40వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పోచంపల్లి వాసికి విశిష్ట కవి పురస్కారం

భూదాన్‌పోచంపల్లి: పట్టణానికి చెందిన కవి వడ్డేపల్లి రాజేశ్వర్ వశిష్ట కవి పురస్కారం అందుకున్నారు. మహాకవి కుసుమ ధర్మన్న జయంత్యుత్సవాలను పురస్కరించుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం కుసుమ ధర్మన్న కళాపీఠం, తెలంగాణ భాషా సంస్కృతికశాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వర్‌కు నిర్వాహకులు పురస్కారం ప్రదానం చేశారు. శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రాధా కుసుమ, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.



కవి వడ్డేపల్లి రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

• రహదారిపై ఎడారి ఓడ

జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామ స్టేజీ వద్ద ఆదివారం మధ్యాహ్నం రహదారి మీదుగా పలు కుటుంబాల వారు ఒంటెలతో వెళ్తుండగా స్థానికులు వాటిని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఒంటెల యజమాని మస్తాన్‌ను పలకరించగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు ప్రాంతం నుంచి వస్తున్నామని.. సూర్యాపేట వెళ్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఒంటెలను తిప్పుతూ యాచన చేస్తుంటామని, పట్టణాల్లోకి వెళ్లాక పిల్లలు, పెద్దలను ఒంటెలపైకి ఎక్కించి తిప్పుతూ వారిచ్చే డబ్బులతో జీవనం సాగిస్తామని పేర్కొన్నాడు. – అర్వపల్లి



దర్వేశిపురంలో నేడు వేలం

కనగల్ : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ దేవస్థానం వద్ద నేడు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాల సేకరణకు రూ.3లక్షలు, వాహనాలకు బొట్టు పెట్టే హక్కులకు రూ.2లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.10లక్షలు, చీరలు–వడిబియ్యం సేకరణకు రూ.లక్ష ఏదైనా జాతీయ బ్యాంకులో ఏపీజీవీబీ నల్లగొండ రామగిరి బ్రాంచిలో చెల్లుబాటు అయ్యేలా డీడీ తీసి మధ్యాహ్నం 1 వరకు వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేటినుంచి 48 గంటల మహాధర్నా

భువనగిరి టౌన్ : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట సోమవారం నుంచి 48 గంటల పాటు మహాధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ జిల్లా నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో భాగంగా వంటావార్పు ఉంటుందని, సిబ్బంది అంతా హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆలయ క్యూకాంప్లెక్స్‌లో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు అధికంగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, కొండ కింద లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో భక్తుల రద్దీ కనిపించింది. స్వామివారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. నిత్యాదాయం రూ.68,33,880 వచ్చినట్లు పేర్కొన్నారు.



ఆలయ ముఖ మండపంలో స్వామివారి దర్శనం కోసం వేచి చూస్తున్న భక్తులు

వేసవిలో ఉద్యాన పంటలను కాపాడుకుందాం ఇలా..

- పెద్దవూర మండల ఉద్యానవన శాఖ అధికారి మురళి సూచన



పెద్దవూర: నల్లగొండ జిల్లాలో ఉద్యాన పంటలైన మామిడి, అరటి, నిమ్మ, బత్తాయి, జామ పంటల సాగు విస్తీర్ణం ప్రతి ఏడాది పెరుగుతోంది. వేసవిలో తగిన జాగ్రత్తలు చేపట్టకపోతే ఆ చెట్లు అధిక ఉష్ణోగ్రతలకు లోనై దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వేసవిలో దిగుబడులు తగ్గకుండా పంటలను కాపాడుకోవచ్చునని ఉద్యానవన శాఖ పెద్దవూర మండల అధికారి మురళి చెబుతున్నారు. ఉద్యాన పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

❖ **మామిడి :** మామిడి చెట్లు ప్రస్తుతం పిందె దశలో ఉన్నాయి. ఈ పిందె రాలకుండా నిలబెట్టుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లీటర్ నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా నాలుగు లీటర్ల నీటికి 1 మిల్లీలీటర్ ప్లానోఫిక్స్ కలిపి పిచికారీ చేయాలి. దోమ వ్యాపించే అవకాశం కూడా ఉండటంతో దీని నివారణకు లీటరు నీటికి 0.5 మిల్లీలీటర్ల కాన్ఫిడార్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ కాలంలో పండు ఈగ ఆశించే అవకాశం ఎక్కువ. దీని నివారణకు గాను తోటల్లో లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల మలథియాన్, 2 మిల్లీలీటర్ల మిథైల్ యుజీనాల్ కలిపి ఎర ద్రావణం తయారు చేయాలి. తర్వాత ఒక్కొక్క ప్లాస్టిక్ పల్లెంలో 250 మిల్లీలీటర్లు ద్రావణాన్ని పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలి. ప్యాకింగ్ చేసిన మామిడి కాయలను దూర ప్రాంత రవాణాకు కోసిన 6–8 గంటలలో శీతల గిడ్డంగులలో నిల్వ ఉంచాలి. అందులో 12.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత, 80–90 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. లేత తోటలలో మొక్కలకు నీరు పెట్టడం ద్వారా ఎండ వేడిమి నుంచి కాపాడుకోవచ్చు.

❖ **అరటి :** అరటిలో వైరస్ తెగుళ్ల వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు ఒక లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. అవిసె లాంటి త్వరగా పెరిగే మొక్కలను తోట చుట్టూ 3–4 వరుసలు నాటుకుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. గెలలు సగం పూర్తఅయ్యాక కార్శి పంట కోసం ఒక సూది పిలకను వదిలి మిగిలిన పిలకలను కోసి వేయాలి. వేసవిలో గెలల రక్షణకు గెలలకు ఎండు ఆకులను చుట్టి ఎండ నుంచి రక్షించాలి. లేత గెలల తోటలో వడ గాలులకు ఆకులు పూర్తిగా మాడి పోయి ఎండిపోతాయి. అరటి గెలలు సరిగా తయారుగాక ఎండ వేడిమికి మాడిపోతాయి. ఇటువంటి తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా ఇవ్వాలి. లీటరు నీటికి 5గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేసి నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చు.

❖ **సపోటా :** లేత సపోటా తోటలకు తప్పనిసరిగా నీరు పెట్టాలి. ముదురు తోటలకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి.



జామ తోట



అరటి తోట

❖ **బత్తాయి, నిమ్మ :** ఈ తోటలలో చెట్లపై మంగు నివారణకు లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల డైకోఫాల్ కలిపి పిచికారీ చేయాలి. అధిక వేడి నుంచి చెట్లను కాపాడుకోవటానికి చెట్ల పాదల్లో ఎండు ఆకులు, వరి పొట్టు పోసుకోవాలి. లీటరు నీటికి 20 గ్రాముల సున్నం కలిపిన ద్రావణాన్ని పల్చటి తెల్లటి పొర ఏర్పడే విధంగా చెట్లపైనా, కాయలపైనా పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పాటు జిగురును కొద్దిగా కలుపుకుంటే సున్నం ఆకులను, కాయలకు బాగా అతుక్కుని ఎక్కువ కాలం ఉంటుంది.

❖ **జామ :** జామ తోటలో చెట్ల బెరడు తొలిచే పురుగు నివారణకు కాండం రంధ్రాలలో 5 మిల్లీలీటర్ల డైక్లోరోఫాస్ లేదా కిరోసిన్ పోసి బంక మట్టితో పూడ్చాలి.